క్లుప్తంగా

రక్తదానం మహోన్నతం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణాన్ని కాపాడటమేనని జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు, హమాలీలు సుమారు 90 మంది రక్తదానం చేశారు. వారికి షర్మిల అశోక సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బం, కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీ కుమార్, డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, బస్ స్టేషన్ మేనేజర్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో అజోల్లా పెంపకం

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అజోల్లా పెంపకం ప్రారంభించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి శుక్రవారం తెలిపారు. రైతు సాధికారక సంస్థ సభ్యుడు ఎం.గురువు నాయుడు బోటనీ ప్రథమ,ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు దీని పెంపకాన్ని వివరించారు. అజోల్లా అనేది జీవన ఎరువు అని, పశువుల ఆహారం, మొక్కల పెంపకంలో దీని ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీదేవి మాట్లాడుతూ అజోల్లాని కోళ్లకి, పశువులకు దాణాగా వేయడం వల్ల వాటికి బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎం.శ్రీదేవి, అధ్యాపకులు టి.నాగమణి, బి.ఆశాలత పాల్గొన్నారు.

11న కృష్ణారావుకు ఆత్మీయ సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: ప్రముఖ సామాజిక వేత్త, పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు నైనాల కృష్ణారావుకు ఆత్మీయ సత్కారం, అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం కమిటీ కన్వీనర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయనకు డాక్టరేట్ వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని మోరంపూడి వద్ద గల ఏపీ ఎస్పీబీ ఇంజినీర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఘనంగా పంచమంగళ హారతులు

కడియం: మండలంలోని కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ ఆలయంలో ప్రతి శుక్రవారం జరిగే పంచమంగళ హారతులు ఘనంగా జరిగాయి. అనంతరం అమ్మవారి పవళింపు సేవ, భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ పర్యవేక్షణలో భక్తుల సహకారంతో జరిగిన ఆయా కార్యక్రమంల్లో పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరయ్యారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

కడియం: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా సబ్బి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా నరేష్, కార్యదర్శిగా అబ్బులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా నాయకులు ఎం.లక్ష్మణరావు, భరద్వాజ, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వెంకటేశ్వర నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, వాకర్స్ రోడ్, ఏవీ అప్పారావు రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధులు, కాంచన నగర్, ఎస్‌బీఐ కాలనీ, వెంకటేశ్వర నగర్, వాకర్స్ పార్క్ ఎదుట వీధులు, డీవీబీ రాజు స్క్వేర్ 62 ఫ్లాట్లు, ఆక్సిజెన్ టవర్స్, సుక్షేత్ర అపార్ట్‌మెంట్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఫాదర్ దేవదాసయ్య జ్ఞాపకార్థ కూటమి

కడియం: బైబిలు మిషను వ్యవస్థాపకుడు ఎం.దేవదాసయ్య జ్ఞాపకార్థ కూటమి శుక్రవారం ఘనంగా జరిగింది. జేగురుపాడు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో సంఘ కాపరి సీహెచ్ రత్నదీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవదాసయ్య చేతుల మీదుగా జేగురుపాడు గ్రామంలో పుట్టిన బైబిలు మిషను ప్రపంచ వ్యాప్తంగా విస్తృత సేవలందిస్తోందని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో శ్రీవల్లి, సంగీత, మురళీ, సూరిబాబు పాల్గొన్నారు.

ఆశ సిబ్బంది నిరసన

కడియం: శాంతియుత నిరసనకు విజయవాడ వెళుతున్న తమను అడ్డుకోవడంపై మండల ఆశ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల యూనియన్ అధ్యక్షురాలు నాగమణి, పద్మ, వి.లక్ష్మి, ముత్యవేణి, సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగంలో సత్తా..



- పోటీల్లో రాణిస్తున్న చిన్నారులు, యువత
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్: చదరంగంలో చిన్నారులు, యువత తమదైన శైలిలో దూసుకుపోతూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకూ ఎంపికవుతున్నారు. పోటీల్లో ఎత్తుకు పైఎత్తు వేసి ప్రత్యర్థిని చిత్తు చేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రరంలోని వైఎంఏ హాలులో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎంకే చెస్ అకాడమీ, యంగ్ మెన్స్ అసోసియేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 220 మంది క్రీడాకారులు తలపడ్డారు. మొత్తం తొమ్మిది రౌండ్లలో జరిగిన ఈ పోటీల్లో ముప్పన జ్ఞాన సంతోష్ 9 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. కె.మహేష్ కుమార్, డి.లక్ష్మణరావు, వి.సాత్విక్, వరహ ప్రేమసాయి విజయం సాధించారు. పోటీల్లో మొదటి 20 మంది విజేతలకు రూ.50 వేలు నగదు బహుమతిగా అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన వారు జాతీయ పోటీలకు సైతం ఎంపిక కావడంతో కోచ్‌లు, క్రీడా నిపుణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

చదరంగం ఆడడం వల్ల మెదడులో జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మరింత చురుకుగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువుల కారణంగా ఏర్పడే మానసిక ఒత్తిడి దూరమవుతుంది. సమస్యను అధిగమించే పోటీతత్వం అలవడుతుంది. ఐక్యూ, పెరడగంతో పాటు, మతిమరుపు ఉన్న చిన్నారులకు చదరంగం ఒక మంచి ఔషధంగా పనిచేస్తుంది. పిల్లలో సృజనాత్మక పెరగడంతో పాటు వారి మానసిక ఉల్లాసం చేకూరుతుంది.

ఉన్నత శిఖరాలకు..

జిల్లా చదరంగం సంఘం ద్వారా అనేక మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో పాటు పతకాలు సాధించడం ఎంతో గర్వకారణం. ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ఆటకు మంచి గుర్తింపు ఉంది. అలోచన శక్తిని పెంచుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. గతంతో పోల్చితే ఇప్పుడు చిన్నారులు, యువత చదరంగంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. మంచి శిక్షణతో పాటు ప్రతిభ ఉంటే చదరంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు.

\- జీవీ కుమార్, జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి



రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో విజేతలు (ఫైల్)

పేదల ఆరోగ్యానికి భరోసా



రామతులసికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న మంత్రి వేణు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు
- రూ.8 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్), వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాలు పేదల ఆరోగ్య భద్రతకు కొండంత భరోసా కల్పిస్తున్నాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుర్రిలంక గ్రామానికి చెందిన తాడాల రామతులసికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.8 లక్షల చెక్కును శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన తాడాల ఏడుకొండలు లివర్ వ్యాధి సమస్యతో ఇటీవల మృతి చెందాడన్నారు. ఆయనకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును భార్య తాడాల రామతులసికి అందించామన్నారు. ఈ సాయం త్వరితగతిన వచ్చేలా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి చేశారన్నారు. పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య శ్రీ పథకం పరిమితికి రూ.25 లక్షలకు పెంపు చేసి, ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామన్నారు.

ఘనంగా జనవిజ్ఞాన వేదిక సైన్స్ కళాజాత

కంబాలచెరువు: స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి మహిళా కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బి.చైతన్య శేఖర్, అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సైన్స్ కళాయాత్ర ఈ నెల 5 నుంచి 18 వరకూ, శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.పైడయ్య, కార్యదర్శి సీహెచ్.శ్రీరాములు, రాజమండ్రి కన్వీనర్ జి.తాతారావు, యూటీఎఫ్ నాయకులు రమేష్, జిల్లా కోశాధికారి ఎస్.రవిబాబు, రాష్ట్ర నాయకులు మురళీధర్, స్థానిక నాయకులు జార్జి ప్రసాద్ పాల్గొన్నారు.



కళాజాత నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

వెట్టిచాకిరీ చేయించడం తీవ్ర నేరం



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ భారత రాజ్యాంగం 23వ అధికరణ ప్రకారం మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిషిద్ధమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారికి చట్టపరమైన శిక్షలు ఉన్నాయన్నారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం 1976లోని కీలక అంశాలను అందరూ తెలుసుకోవాలన్నారు. మనుషులను స్వచ్ఛందంగా కాకుండా బలవంతంగా, మోసపూరితంగా, బెదిరింపులతో పని చేయించుకోవడం, ఆ పనికి తగినంత వేతనం ఇవ్వకపోవడం, వారిని నిర్బంధంలో ఉంచి స్వేచ్ఛకు భంగం కలిగించడం నేరమన్నారు. ఈ నేరాలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారించే అధికారం ఉంటుందన్నారు. వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడం, రక్షణ కల్పించడం, విడిపించి పునరావాస చర్యలు తీసుకోవడంలో వివిధ శాఖల పాత్రను న్యాయమూర్తి వివరించారు. అనంతరం సంస్థ కార్యాలయం నుంచి పుష్కర ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలీ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ హెడ్ ప్రోగ్రాం పార్టనర్‌షిప్ మేనేజర్ ఎం.జేసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.5 లక్షలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీకి చెందిన దొరబాబు కుమారుడు మూడేళ్ల వి.మహీ భార్గవ్ వైద్య సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. గ్లోమెరులోనెఫ్రిటిస్ (ఆర్‌పీజీఎన్) ఏఎన్‌వి హీమోడయాలసిస్ బాధపడుతున్న వి.మహీభార్గవ్ గుంటూరులోని పిల్లల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. మానవత్వంతో స్పందించిన ముఖ్యమంత్రి జగన్ ఆ చిన్నారి వైద్యం కోసం ఆసుపత్రి చార్జీలు, ఫార్మసీ, పరిశోధనలు, హీమోడయాలసిస్‌కు సొమ్ములు మంజూరు చేశారన్నారు.

ఉత్సాహంగా 'పల్లెకు పోదాం'

రాజమహేంద్రవరం రూరల్: పల్లెకు పోదాం అంటూ బీజేపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ కన్వీనర్ యానాపు ఏసు, బూత్ కమిటీ అధ్యక్షుడు బీవీ రామారావు ఆధ్వర్యంలో ఆ పార్టీకర్తలు తొర్రేడులో శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని సీనియర్ నాయకులను కలుసుకున్నారు. గ్రామంలోని సచివాలయం సెంటర్, రైతు భరోసా కేంద్రాలను కూడా సందర్శించి, ప్రధానమంత్రి మోదీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చిట్టూరి ప్రసాద్, ఓబీసీ మోర్చా మండల నాయకులు మల్లువలస రాంబాబు, పాలడుగుల గాంధీ, ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు రాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

బయో సదస్సులో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



బయో సదస్సులో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు

కంబాలచెరువు: విశాఖపట్నంలో ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకూ జరిగిన ఆంధ్ర బయో సమ్మిట్ 2024లో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బయోటెక్నాలజీ విభాగానికి చెందిన 12 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు ప్రొటీన్ మోడలింగ్, కంప్యూటర్ ఎయిడెడ్ డ్రగ్ డిజైనింగ్, పీసీఆర్ అండ్ జెల్ ఎలక్ట్రోఫెరిసిస్ వంటి పలు పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించుకున్నారన్నారు. ఆ విద్యార్థులను శుక్రవారం ఆయన, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ శాఖాధిపతి డాక్టర్ బి.నాగేశ్వరి, డాక్టర్ కె.అనుష్క, ఐ.పర్ణిక సాయి పాల్గొన్నారు.

కోలమూరులో 459 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు -3 గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరంలో 459 మందికి వైద్యసేవలు అందించారు. ఒకరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫరల్ చేశారు. కాతేరు పీహెచ్‌సీ డాక్టర్ ఈ.నాగదేవి, ఆర్థోపెడీషియన్ జీకేఎస్.పూర్ణిమ, క్రిటికల్ కేర్ వైద్యుడు రవి చావ్ల, ఆప్తాల్మిక్ ఆఫీసర్ డి.సాంబయ్య వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి రక్తం, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. వైద్యుల సిఫారసు మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాజీ ప్రధాని, తెలుగువారి ముద్దుబిడ్డ స్వర్గీయ పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక గోదావరి గట్టున ఉన్న పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను ఉద్దేశించి ఆకుల వీర్రాజు మాట్లాడుతూ పీవీ నరసింహారావు కేంద్ర మంత్రిగా, భారత ప్రధానిగా ఎంతో సమర్థంగా పనిచేశారన్నారు. దేశ అభివృద్ధికి అనేక ఆర్థిక సంస్కరణలను తీసుకువచ్చిన గొప్ప ఆర్థిక వేత్త అన్నారు. కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు, కోచ్ వీటీవీ సుబ్బారావు, కర్రి వీరబాబు, బొబ్బిలి భాస్కరరావు పాల్గొన్నారు.

కడియం: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ఆనందదాయకమని బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గిరజాల కృష్ణారావు కళావేదికలో ఆనందోత్సవాలు నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావుకు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తాము బాధ్యతా సేవా సంస్థ తరపున పుష్కర కాలంగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కడియం శివాలయం కమిటీ చైర్మన్ ఆర్ఎస్ఎన్ మూర్తి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, స్థానిక ప్రముఖులు చిక్కాల శ్రీనివాసరావు, కుసునూరు బాబులు, పిండి నాగరాజు, పూడి బ్రహ్మం, మందపల్లి త్రిమూర్తులు, కడియం గణేష్, గుడాల సత్యనారాయణ పాల్గొన్నారు.



పీవీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు



పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న గిరజాల బాబు తదితరులు

25న ప్రైవేట్ హాస్పిటల్స్ నర్స్‌ల జిల్లా సభ



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ప్రైవేట్ హాస్పిటల్స్ మేల్, ఫిమేల్ నర్స్‌ల సంఘం జిల్లా సభ ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ట్రేడ్ యూనియన్ నాయకుడు నేదునూరి బోసు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను కలిసి, సమస్యలపై వినతిపత్రం అందించారు. బోసు మాట్లాడుతూ జిల్లా మహాజన సభ జరిగే ప్రాంగణం వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ సభ్యులు నరేష్, సిద్దూ, వంశీ, రాజు, మణికంఠ, ఇజాక్, నాగబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కోరుకొండ మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.హేమసుందర రావు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి సోమవారం వరకూ వలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రభుత్వ అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. గ్రామాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాలను మెరుగుపర్చడం కోసం ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు జరపాలన్నారు. సారా రహిత గ్రామీణ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు సెబ్ అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ పనితీరును మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మురుగునీటి నిర్వహణ విషయంపై సుదీర్ఘంగా చర్చించి, కచ్చా కాలువల స్థానంలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎండీపీవోను ఎంపీపీ సూర్యకుమారి, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉల్లి బుజ్జిబాబు ఘనంగా సత్కరించారు.

రేపే ఆడపడుచుల ఆశీర్వాద సభ

- రాజానగరంలో ముమ్మర ఏర్పాట్లు
- భారీగా తరలిరానున్న మహిళలు

రాజానగరం: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు మరోసారి పట్టం కట్టాలనే సంకల్పంతో రాజానగరంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆడపడుచుల ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. గడచిన నాలుగేళ్ల పది నెలల్లో నియోజకవర్గంలో ప్రతి గ్రామం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించేలా రూ.1,168 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రూ.1,148 కోట్లను ఆడపడచులకు అందజేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ గోదావరి జలాలను అందించేలా రూ.215 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేసి, ఇంటింటికీ కుళాయిలు వేయించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆడపడుచుల ఆశీసులు మరోసారి పొందాలనే సంకల్పంతో ఈ సభను నిర్వహిస్తున్నారు.

చురుకుగా ఏర్పాట్లు

సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి భారీ ఎత్తున మహిళలు తరలి వచ్చే ఈ సభకు జాతీయ రహదారిని ఆనుకుని రాయల్ కన్వెన్షన్‌కి ఎదురుగా ఉన్న మైదానంలో అవసరమైన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. నియోకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఇప్పటికే నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి, మహిళలకు ఆహ్వానం పలికారు.



మహిళలను ఆహ్వానిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సినిమాలు



శ్యామల	:	లాల్‌సలామ్
సూర్యమినీ	:	ఈగల్
సూర్యప్యాలెస్	:	తేరా బాతోన్ మేరీ ఐసా
స్వామి	:	ఈగల్
శివజ్యోతి	:	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
అనుశ్రీ	:	హనుమాన్
రాజా	:	ఈగల్
అశోక	:	ఈగల్
ఊర్వశి	:	యాత్ర – 2
రంభ	:	ఈగల్
మేనక	:	నా సామిరంగ
అప్సర	:	గుంటూరుకారం
కుమారి	:	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
నామవరం		
వీఎస్ మహల్	:	ఈగల్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	యాత్ర – 2
కడియం		
వెంకటసూర్య	:	ఈగల్